క్లుప్తంగా

టీటీడీ చైర్మన్‌గా భూమన ఎంపిక హర్షణీయం


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: టీటీడీ చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంపిక చేయడం హర్షణీయమని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2006–2008 వరకు టీటీడీ చైర్మన్‌గా భూమన అందించిన సేవలు ఆదర్శనీయమని, తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమనకు మళ్లీ చైర్మన్‌గా బాధ్యతలు ఇవ్వనుండడంతో టీటీడీ అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు


ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 127–8, 129–1లోని ప్రభుత్వ భూమిని కొంతమంది స్థానికులు ఆక్రమించి సాగుకు సిద్ధం చేస్తున్నారనే విషయం రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఆక్రమిత భూముల్లో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల్లో అనుమతిలేకుండా ఎవరు దిగినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ హెచ్చరించారు.

ముగిసిన పీర్ల పండుగ



చిల్లకూరు: మొహర్రం పురస్కరించుకుని నిర్వహించిన పీర్ల పండుగ ఆదివారంతో ముగిసింది. నాంచారమ్మపేట గ్రామంలోని పీర్ల చావిడి వద్ద హిందూ, ముస్లింలు కలిసికట్టుగా పీర్ల పండుగను నిర్వహించారు. శుక్రవారం రాత్రి అగ్నిగుండం ప్రవేశం చేసిన అనంతరం శనివారం రాత్రి పేదలకు అన్నదానం చేశారు. చివరి రోజు పీర్లను ప్రత్యేకంగా అలకరించిన అనంతరం పూజలు చేసిన పీర్లను సమీపంలో ఉన్న చెరువులో శుభ్రం చేసి తిరిగి పీర్ల చావడిలో భద్రపరిచారు. పీర్ల పండుగ ముగిసినట్లు ముస్లిం పెద్దలు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవాలు



గూడూరురూరల్: పట్టణంలోని రాణిపేట ప్రాంతం నాయుడుకాలువ కట్టపై వెలసియున్న శ్రీపోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో అమ్మవారికి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే ఆదివారం అమ్మవారికి పలు రకాలు పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెట్లు, మేళ తాళాల నడుమ చిన్నారుల నృత్య సందడి మధ్య ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

గ్యాస్ లీకై దుకాణం దగ్ధం

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామానికి చెందిన శశి అనే వ్యక్తి చింతవరం గ్రామంలో చికెన్ పకోడా దుకాణం నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం గ్యాస్ సిలిండర్ లీకై దుకాణానికి మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ మంటల్లో దుకాణంలో ఉన్న వస్తువులు, సరుకులతో పాటు నగదు కాలిపోయినట్లు బాధితుడు శశి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


వెంకటేశ్వర్లుకు ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

సైదాపురం: మండలంలోని చాగణంరాజుపాళెం ఎర్ర సంఘం గిరిజన కాలనీలో ఆదివారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. యాకసిరి వెంకటేశ్వర్లు(21)కు లింగసపాళెం గ్రామానికి చెందిన పంతగిరి వెంకటరత్నమ్మ(19)తో ఏడాది క్రితం వివాహమైంది. వెంకటేశ్వర్లు మద్యానికి బానిస కావడంతో తల్లీదండ్రులు మందలించారు. దీంతో వెంకటేశ్వర్లు మనస్తాపం చెంది ఇంట్లోనే డీవార్మింగ్ మందును తాగేసి అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబీకులు వెంటనే సైదాపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోటపోలూరు గ్రామానికి చెందిన గడ్డం జయమ్మకు ఆరు అంకణాల సొంత స్థలం ఉంది. ఇంటి కోసం వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. వెంటనే సచివాలయ సిబ్బంది ఇంటి నిర్మాణ మంజూరుకు సంబంధిత అధికారులకు తెలిపి రూ. 97 వేల నగదుతోపాటు ఇసుక, ఇటుక, ఐరన్ మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం శ్లాబ్ దశ పూర్తి చేసుకుంది. పూత పనులు మిగిలాయి. ఇంటి నిర్మాణం సులభమైంది. ఈ ప్రక్రియ మొత్తం వలంటీర్, గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా సాధ్యమైంది.



ఆబాక గ్రామానికి చెందిన పద్మనాభయ్యకు రెండు ఎకరాలపైగా పొలం ఉంది. రెవెన్యూ పట్టాదారు పాసుపుస్తకం కోసం గ్రామ పరిధిలో ఉన్న సచివాలయానికి దరఖాస్తు చేశారు. వెంటనే వీఆర్వోలు భూ రీసర్వే చేసి పాసుపుస్తకం అందజేశారు. సచివాలయాలు గ్రామాలకు దగ్గరలో ఉండడం వల్ల అన్ని రకాల రెవెన్యూ సేవలు అందుతున్నాయి. గతంలో మండల కేంద్రానికి తిరిగి ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

సేవాలయాలు..


కేసీఎన్‌గుంటలో సచివాలయం

- సచివాలయాల్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు
- ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట రూరల్ పరిధిలో 19 పంచాయతీలు, 8 సచివాలయాలు, 43 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పౌర సేవలు అందాలంటే మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో కాళ్లరిగేలా తిరగాలి. సమస్యలు పరిష్కారం అవుతాయో లేదో తెలియదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆయా గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందేలా గ్రామ సచివాలయాల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా గ్రామస్థాయిలోనే పరిపాలన సేవలు అందుతుండడంతో పల్లె ప్రజలకు ఇది వరంగా మారింది. ఈ వ్యవస్థ వల్ల ప్రజలకు ఉత్తమ సేవలు, ఇంటి ముంగిటే సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

అన్ని రకాల సేవలు..

గతంలో సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లి అధికారుల కోసం పడిగాపులు కాయాల్సివచ్చేది. పట్టాదారు పాస్ పుస్తకం, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పింఛన్ల మంజూరుకు నానా అవస్థలు పడేవారు. ప్రస్తుతం సచివాలయాలతో ప్రజలకు అన్ని రకాల సేవలు గ్రామస్థాయిలోనే అందించే వెసులుబాటు కలిగింది.

ఇంటి ముంగిటకే పథకాలు..

గ్రామ సచివాలయ వ్యవస్థకు వలంటీర్లను ఏర్పాటు చేసి, ప్రజల ఇంటి ముంగిటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. గతంలో పింఛన్ల కోసం వృద్ధులు దివ్యాంగులు, వితంతువులు, పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. ప్రస్తుతం వలంటీర్లు ప్రతినెలా 1న ఉదయాన్నే ఇంటికి వెళ్లి పింఛన్ల నగదు అందజేస్తున్నారు. రెవెన్యూ పరమైన సేవలు కూడా సచివాలయాల్లోనే అందిస్తుండడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. అధికారుల కోసం వేచి చూసే పనిలేకుండా అధికారులే ప్రజల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రభుత్వం తీసుకొచ్చింది.

సూళ్లూరుపేట మండలంలో ఎనిమిది సచివాలయాల పరిధిలో..

సంక్షేమ పథకం	లబ్ధిదారులు
అమ్మఒడి	3,673
విద్యాదీవెన	2,144
వసతి దీవెన	1,378
వాహన మిత్ర	208
వైఎస్సార్ చేయూత	2,509
కాపు నేస్తం	55
ఈబీసీ నేస్తం	134
ఆరోగ్యశ్రీ	413
వైఎస్సార్ ఆసరా	5,003
వైఎస్సార్ చేదోడు	82
రైతు భరోసా	5,155
ఇళ్ల మంజూరు	945
స్థలం ఉండి ఇళ్ల నిర్మాణం	704
జగనన్న తోడు	446
నేతన్న నేస్తం	17
వైఎస్సార్ బీమా	544

దాహార్తిని తీరుస్తున్న నేదురుమల్లి ఫౌండేషన్


ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

వెంకటగిరిరూరల్: ప్రజలకు అత్యంత అవసరమైన తాగునీటిని అందిస్తూ ప్రజలకు నేనున్నానంటూ నేదురుమల్లి ఫౌండేషన్ భరోసా కల్పిస్తుంది. పట్టణంలోని కాశితోటలో పైప్‌లైన్ లీకేజీ కారణంగా వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని 1నుండి 9వ వార్డు ప్రజలకు రెండు రోజుల నుంచి మున్సిపల్ వాటర్ సరఫరా నిలిచిపోయింది. దీంతో నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా ట్యాంకర్ ద్వారా వార్డు ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బడుగుల విప్లవస్ఫూర్తి గద్దర్


మాట్లాడుతున్న గద్దల మునెయ్య

వెంకటగిరి: బడుగు, బలహీనవర్గాల విప్లవస్ఫూర్తి ప్రజాగాయకుడు గద్దర్ అని ఆయన మృతి ఆ వర్గాలకు తీరనిలోటని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గద్దల మునెయ్య తెలిపారు. ఆ వేదిక స్థానిక కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన గద్దర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కోటలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ

–రూ.3కోట్లు కేటాయించిన ప్రభుత్వం

కోట: కోటలో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపా రు. కోట క్రాస్ రోడ్డు నుంచి బజారువీధి, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు ప్రధాన రహదారిని విస్తరించి మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. కోట క్రాస్‌రోడ్డు నుంచి ఎన్‌సీఆర్ నగర్ వరకు తారు రోడ్డు నిర్మాణం, ఎన్‌సీఆర్ నగర్ నుంచి కొక్కుపాడు రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కోటలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుండగా రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3కోట్లు కేటాయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు డీఈఈ తెలిపారు.

నేడు మండల సమావేశం

సైదాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ పలుగొటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కండలేరులో 16.866 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 16.866 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 930 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిజ్‌కు60, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

మణిపూర్ ఘటనపై క్రైస్తవుల నిరసన


గూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



చిల్లకూరులో..

గూడూరురూరల్: మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలకు నిరసనగా పట్టణంలో ఆదివారం ఎస్‌ఏఎల్‌సీ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నోటికి నల్ల మాస్కులను కట్టుకుని నిరసన తెలిపారు. ఎస్‌ఏఎల్‌సీ చర్చి పాస్టర్ ఓడీజే ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఏఎల్‌సీ సంఘం ప్రతినిధులు చంద్ర, చిన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

చిల్లకూరు: మణిపూర్‌లో జరుగుతున్న దాడులను నిరసిస్తూ క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మోమిడి గ్రామంలో ఉన్న సెయింట్ పాల్ లూథరన్ చర్చికి చెందిన క్రైస్తవులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎవాంజిలిస్టు చిట్టిబాబు, సుధాకర్, మహిళా సమాజ సభ్యులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు దురదృష్టకరం

కోట: మణిపూర్‌లో క్రైస్తవులు, మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఆదివారం కోటలోని సెయింట్‌పాల్ లూథరన్ చర్చి సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ మతపెద్దలు మాట్లాడుతూ మణిపూర్ ఘటనలు దురదృష్టకరమన్నారు. ఇలాంటివి మరోసారి జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు కృషిచేయాలన్నారు. రెవరెండ్ నరేష్ కుమార్, రమ్య, రవిబాబు, హెరాల్డ్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

వెంకటగిరి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని యునైటెడ్ క్రిష్టియన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎస్ పాల్‌మనోహర్ తెలిపారు. ఆదివారం మణిపూర్ ఘటనలపై పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు చెందిన క్రైస్తవులు వెంకటగిరిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఆరోగ్యదాస్, ట్రెజరర్ ప్రభుదాస్, దక్షణాంధ్ర లూథరన్ చర్చి, హోసన్నా ప్రార్థనామందిర సంఘాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


వెంకటగిరిలో ర్యాలీ

యాచకుడి మృతిపై కేసు నమోదు


మృతిచెందిన యాచకుడు

నాయుడుపేటటౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో బిక్షాటన చేసే గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాల మేరకు..35 సంవత్సరాలు వయస్సు కలిగి దివ్యాంగుడైన వ్యక్తి రెండు నెలలుగా బస్టాండు ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ ఉండే వాడని పోలీసులు గుర్తించారు. బస్టాండు ప్రాంగణం సమీపంలో మృతిచెంది ఉండడాన్ని ఆర్టీసీ కంట్రోలర్ గుర్తించి ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. అతనికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే సీఐ నరసింహారావు నంబర్‌కు 9440796357కు ఫోన్ చేసి చెప్పాలని తెలిపారు.

భక్తి ప్రపత్తులతో మహాలక్ష్మి మహాయాగం


వేదపారాయణం చేస్తున్న వేదపండితులు

తిరుపతి కల్చరల్: తిరుపతి డీబీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన 225 కుండలాల యాగ మండపంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి మహాయాగ యజ్ఞం సాగింది. ఈ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా వేదపారాయణం, సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఝులారియా పీఠాధిపతి ఘన్‌యామాచార్యజీ మహారాజ్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమన్నారాయణస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన శ్రీమద్ భాగవత ప్రవచనంలో కైలాస్ చంద్రస్వామీజీ గజేంద్రమోక్షం, దేవతలు అమృతం పొందడానికి సముద్ర మథనం చేపట్టే ఘటన, శ్రీరామ్ అవతార్, శ్రీకృష్ణజన్మాష్టమి వంటి ఘట్టాలను విపులంగా వివరించి భక్తులను ఆకట్టుకున్నారు.

రాష్ట్ర పండుగగా పోలేరమ్మ జాతర


సాలికాలనీలో అంబళ్లు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, భక్తులు

- అంబరాన్నంటిన సంబరం

వెంకటగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్రపండుగగా గుర్తిస్తున్నట్లు ఇటీవల ప్రకటించడంతో నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని వాడవాడలా వార్డుల్లో ఉన్న పోలేరమ్మ ఆలయాల్లో సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఆదివారం పట్టణంలోని 4వ వార్డు సాలికాలనీలోని పోలేరమ్మ ఆలయంలో వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ ఆధ్వర్యంలో, 5వ వార్డు దొమ్మరపాళెం అమ్మవారి ఆలయంలో ఆ వార్డు కౌన్సిలర్ ఎస్ శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ మాట్లాడుతూ వెంకటగిరీయులు, పోలేరమ్మ భక్తుల చిరకాల వాంఛ అయిన జాతరను రాష్ట్రపండుగగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు కృషిచేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అనంతరం సంప్రదాయబద్ధంగా అంబళ్లు సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శేతురాశి బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మహిళావిభాగం అధ్యక్షురాలు ధనియాల రాధమ్మ, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, కందాటి కల్యాణి, టి.సుబ్బారావు, ఎం.జానకిరామయ్య, ఎస్.గోపాలకృష్ణ, కె.కృష్ణమూర్తి, వహీదా, ఏ.శ్రీనివాసులురెడ్డి, నేతలు వెంకటరత్నంరాజు, మురళి, జలగం కామాక్షి పాల్గొన్నారు.

విశేష అలంకరణలో తాళ్లమ్మ



డక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామంలో వెలసియున్న గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేసి అలంకరణ చేశారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. ఈఏడాది నూతనంగా గ్రామదేవత తాళ్లమ్మ ఆలయం నిర్మించి అమ్మవారు కొలువు గత నెలలో వైభవంగా నిర్వహించారు. కొలుపులో భాగంగా భక్తులు అమ్మవారికి కానుకల రూపంలో చీరలను బహూకరించారు. చీరలను గ్రామ పెద్దల సమక్షంలో వేలం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేలం పాట ద్వారా దక్కించుకున్నారు.

ప్రతిష్టాత్మకంగా టీసీఎల్ పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న కడివేటి చంద్రశేఖర్

గూడూరురూరల్: ప్రతిఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్(టీసీఎల్) పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం గూడూరులోని సనత్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో టీసీఎల్ పోటీల్లో పాల్గొనే 17 మండలాల టీమ్ కెప్టెన్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజులపాటు టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై చర్చించి లాటరీ పద్ధతిలో 17 టీమ్‌లకు స్పోర్ట్స్ వేర్ కలర్స్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. టోర్నమెంట్ టెక్నికల్ డైరెక్టర్ పీడీ కరిముల్లా ఖాన్, టెక్నికల్ మెంబర్ ఎస్‌కే బాబర్, సీనియర్ క్రీడాకారులు మునిభాస్కర్, శ్రీహరి, బాలాజి, సుబ్రమణ్యం, 17 మండలాల కెప్టెన్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.